క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: కొండాపూర్ సబ్‌స్టేషన్ అవుషాపూర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం కలగనుందని ఏఈ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. అవుషాపూర్, ఎస్వీఆర్ కళాశాల, అరోరా కళాశాల, అనురాగ్ కళాశాల, కే.పాల్ ప్రాంతంలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.34.25లక్షలు పలికిన మేడ్చల్ తైబజారు

మేడ్చల్: మేడ్చల్ తైబజారు వసూలు ధర వేలంలో రూ.34.25లక్షలు పలికింది. తైబజారు కోసం మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వేలం పాట నిర్వహించగా మేడ్చల్‌కు చెందిన రాకేష్ అనే వ్యక్తి రూ.34.25లక్షలకు దక్కించుకున్నారని మున్సిపల్ ఆర్ఐ రాంచందర్ తెలిపారు. నిబంధనల ప్రకారం పట్టణంలో తైబజారు వసూలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేయరాదని ఆయన సూచించారు.

ఎమ్మార్ఐటీఎస్ కళాశాల ప్రొఫెసర్‌కు ఓయూ డాక్టరేట్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని ఎమ్మార్ఐటీఎస్ కళాశాల ప్రొఫెసర్ అనుమోని నాగరాజుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ వచ్చింది. నాగరాజు లీక్సీ సెర్చ్ అప్రోచ్ టు సమ్ కాంబినేటరియల్ ఆప్టిమిజషన్ ప్రాబ్లమ్స్ విత్ అడిషనల్ కన్‌స్ట్రెయింట్‌టైన్స్ అంశంపై సీబీఐటీ కళాశాల ప్రొఫెసర్ రమాదేవి ఆధ్వర్యంలో సమర్పించిన పత్రాలకు ఓయూ డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టరేట్ పొందిన ప్రొఫెసర్ నాగరాజు సోమవారం కళాశాల సెక్రెటరీ మహేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవీంద్ర, అధ్యాపకులు అభినందించారు.

రైతులకు పంట రుణాల పంపిణీ



రైతులకు పంట రుణాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కీసర: కీసర రైతు సహకార సొసైటీలో సభ్యత్వం ఉన్న రైతుల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం సొసైటీ నుంచి సుమారు 32 మంది రైతులకు రబీ పంటకు సంబంధించి సుమారు రూ.20.27 లక్షల మేర పంట రుణాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ కృష్ణారెడ్డి, సిబ్బంది నరహరి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబీకులకు ఆర్థిక సాయం



అవుషాపూర్‌లో ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో ఇటీవల మరణించిన అశోక్‌గౌడ్ కుటుంబ సభ్యులకు అతడి స్నేహితులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని మృతుడి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.55,500ల నగదు అందజేశారు. ఆర్థిక సాయం చేసిన వారిలో సుదర్శన్‌రెడ్డి, భాస్కర్, సి.మల్లేశ్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహ, సాయిలు, కె.మల్లేశ్, జి.వెంకటేశ్, స్కైలాబ్ రెడ్డి, సీహెచ్ వెంకటేశ్, సురేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

తల్లిపై దాడి చేసిన కుమారుడికి ఏడాది జైలు



నిందితుడు ఎల్సర్ డెన్సన్

ఉప్పల్: తల్లిపై దాడి చేసి గాయపరిచిన కుమారుడికి న్యాయస్థానం ఏడాది జైలు శిక్ష, జరిమానా విధించింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ శారదనగర్ ప్రాంతానికి చెందిన ఎల్సర్ డెన్సన్ (26) చికెన్ పకోడ తయారు చేస్తాడు. ప్రతి రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చి తల్లి ఎస్తేరును వేధించేవాడు. ఈ క్రమంలో 2020 జులై 24న మద్యం తాగి ఇంటికి వచ్చి డబ్బులు కావాలని వేధించడంతో పాటు కొట్టడం ప్రారంభించాడు. అదే మత్తులో చాకు తీసుకుని తల్లి మీద దాడి చేయడానికి ప్రయత్నించగా అమె తప్పించుకుని పారి పోయింది. ఈ క్రమంలో తల్లి గాయపడింది. దీంతో బాధితురాలు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన ఉప్పల్ పోలీసులు సరైన సాక్ష్యాదారులు సమకూర్చి కోర్టుకు సమర్పించారు. విచారణ అనంతరం మల్కాజిగిరి కోర్టు నిందితునికి సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానను విధించినట్లు ఉప్పల్ పోలీసులు తెలిపారు.

నాగారంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి





మున్సిపాలిటీల అభివృద్ధికి భారీగా నిధులు వెచ్చిస్తున్నాం

మంత్రి చామకూర మల్లారెడ్డి





శిల్పానగర్‌కాలనీ పార్కు ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున నిధులను వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీలో సుమారు రూ.కోటి నిధులతో చేపట్టిన హిందూ శ్మశానవాటికతో పాటు మరో రూ.90 లక్షల నిధులతో 6వ వార్డు పరిధిలోని శిల్పానగర్‌లో అభివృద్ధి పరచిన పార్కును, 20వ వార్డులో మరో రూ.9 లక్షల నిధులతో చేపట్టిన బీటీ రోడ్డును సోమవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రహదారి విస్తరణ కోసం రూ.206 కోట్లు విడుదల చేయడం జరిగిందని, ప్రస్తుతం టెండర్ ప్రక్రియ చేపట్టి త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. హెచ్ఎండీఏ నుంచి రూ.8 కోట్ల నిధులతో వరదనీటి కాలువ నిర్మాణ పనుల కోసం నిధులు కేటాయించడం జరిగిందన్నారు. దీనికి తోడు మున్సిపల్ పరిధిలో రహదారుల విస్తరణ, సీసీరోడ్లు, డ్రైనేజీ పనుల కోసం మరో రూ.15 కోట్ల నిధులకు సంబంధించి మంజూరు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రతి మున్సిపాలిటీల్లో పార్కుల అభివృద్ధి, శ్మశానవాటికల వద్ద సౌకర్యాలు, నర్సరీలు, హరితహారం, డంపింగ్ యార్డు, చెరువుల అభివృద్ధి తదితర పనులకు ప్రభుత్వం పెద్దపీట వేయడం జరిగిందన్నారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిలో చెరువులను కూడా బాగు చేయడం జరిగిందని, ముమ్ముందు మరింత అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధియే ఎజెండాగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ పార్టీని సీఎం కేసీఆర్ పాలనను రాష్ట్ర ప్రజలు ఆదరిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా బీఆర్ఎస్ సత్తా చాటనుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వాణీరెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, డీఈఈ సుదర్శనం, రఘు, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి మల్లారెడ్డి దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లోని కనకదుర్గాదేవి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఓ 59 లబ్ధిదారులు సకాలంలో పన్నులు చెల్లించాలి

కలెక్టర్ అమయ్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ అమయ్‌కుమార్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో జీఓ 59 కింద నోటీసులు అందుకున్న వారంతా సకాలంలో పన్నులు చెల్లించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని వీఆర్ఓ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలకు జీఓ 59పై ఆయన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీఓ 59పై ఉన్న అపోహలు వీడాలని, ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రజలకు జీఓ 59పై ఆటోల ద్వారా విస్తృత ప్రచారం చేసి ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. ఇప్పటికే 240 మంది జీఓ 59 కింద డిమాండ్ నోటీసులు కట్టారని, మరికొందరు మొదటి విడతలో చెల్లించాలని తెలిపారు. వెంటనే అర్హులైన వారంతా డీడీలు కట్టాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, తహసీల్దార్ అనిత, మున్సిపల్ కమిషనర్ రామలింగం, ఆర్ఐ విశ్వనాథ్, కార్పొరేటర్లు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు ఎంపికైన రాజశేఖర్



రాజశేఖర్‌ను అభినందిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు

జవహర్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అసోసియేషన్ కోశాధికారి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కూరపాటి రాజశేఖర్‌ను రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గానికి సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు జిల్లా నుంచి తాను ఎంపికవ్వడం సంతోషంగా ఉందని, జిల్లాలో క్రీడలు, క్రీడాకారులను మరింతగా ప్రోత్సహిస్తాన్నారు. తన ఎంపిక పట్ల రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్టాన్లీ జాన్స్, సెక్రెటరీ సారంగపాని, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు రాజశేఖర్‌ను అభినందించారు.

ఈ-శ్రమ్ కార్డు లబ్ధిదారుల వివరాలు నమోదు



కొర్రెముల్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఘట్‌కేసర్: కొర్రెముల్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-శ్రమ్ కార్డు, ఆయుష్మాన్ భారత్ లబ్ధిదారుల వివరాలు సోమవారం నమోదు చేయించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపెల్లి మోహన్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మీ, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభంజన్, స్వప్న, సంధ్యారాణి, కవిత, సత్యనారాయణ, సురేశ్, బాలరాజ్, ప్రవీణ్‌రెడ్డి, బాలుయాదవ్, శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

కోమటి చెరువు కబ్జాపై ఫిర్యాదు



చెరువు కబ్జాపై ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలో గల కోమటి చెరువు కబ్జాకు గురవుతుందని బీజేపీ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్.647లో గల 23.11 ఎకరాల్లో చెరువు ఉండగా కొందరు కబ్జా చేస్తున్నారని, గతంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా తూతూ మంత్రంగా చర్యలు తీసుకున్నారని ఫిర్యాదులో తెలిపారు. చెరువును కబ్జా నుంచి కాపాడి కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శంకర్, కమల్, సునీల్, రాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 7వ డివిజన్, 21వ డివిజన్ గాంధీనగర్‌లో కాలనీవాసుల సొంత నిధులతో నిర్మించే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కార్పొరేటర్లు చింతల ప్రేమలశ్రీనివాస్, మెట్టు ఆశాకుమారిలతో కలిసి మేయర్ మేకల కావ్య ప్రారంభించారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ బింగి లావణ్య, నాయకులు మెట్టు వెంకన్న, కాలనీవాసులు ఎండీ బషీర్, జానీమియా, నర్సింహ, ఉమేష్, శివ, జహంగీర్, పరుశురామ్, ఉమేష్, తరుణ్, పాషా, మహిళలు రాజమణి, జులేఖ, అలీఫా, రేణుక, మంజు, మమత, ఆషు, కేతమ్మ, రూపమ్మ, సంతోష, కళావతి, పల్లవి, ప్రసన్న, భాగ్య తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న మేయర్ కావ్య

300 మందికి ఓటర్ కార్డుల అందజేత

అల్వాల్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులైనవారందరూ కలిగి ఉండాలని మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. సోమవారం కొకూర్ భరత్‌నగర్ కాలనీలో గతంలో మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో 800 మందికి పైగా ఓటర్ నమోదును చేసుకున్నారు. అందులో మంజూరైన 300 ఓటర్ కార్డులను సోమవారం వారికి అందజేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ గోపాల్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లో పంచాయతీ నిధులు రూ.15 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, అంతర్గత మురికి కాల్వ పనులను సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఎంపీటీసీ రవి, ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, వార్డు సభ్యులు భాస్కర్, మయూరి, శ్వేత, కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు ఇన్నారెడ్డి, సురేశ్, మాజీ సర్పంచ్ రూప్‌సింగ్ స్థానికులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే సమస్యలకు పరిష్కారం

కాప్రా: రాజ్యాధికారంతోనే బీసీ, ఎస్సీ, ఎస్టీల సమస్యలకు పరిష్కారమని అందుకే మనరాజ్యం సాధించుకుందామని దళిత్‌శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షులు విశారదన్ మహారాజ్ అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం అందించడమే లక్ష్యంగా చేపట్టిన స్వరాజ్యపాదయాత్ర సోమవారం కాప్రా సర్కిల్‌లోకి ప్రవేశించింది. 2022 మార్చి 15న నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర 500 రోజుల పాటు 10 వేల కిలోమీటర్లు కొనసాగి జులై 30న మేడ్చల్ జిల్లాలో ముగియనుంది. ప్రస్తుతం ఈ పాదయాత్ర కాప్రా సర్కిల్‌కు చేరుకుని గాంధీనగర్, కాప్రా, వంపుగూడ, ఎల్లారెడ్డిగూడ మీదుగా అల్వాల్ సర్కిల్‌లోకి ప్రవేశించింది. దళిత్ శక్తి ప్రోగ్రాం ప్రతినిధులు లక్ష్మణ్ మహారాజ్, రాజ్‌కమల్, సైదులు, మహేష్, సత్యనారాయణ, రాకేష్, గాలయ్య, కృష్ణ, హరి, మోహన్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

అల్వాల్: పోషణ పక్షంలో భాగంగా అల్వాల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మీ, మెడికల్ ఆఫీసర్, సిబ్బంది సోమవారం పోషణ పక్షంలో భాగంగా గర్భిణీ స్త్రీలకి హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. అనంతరం హిమోగ్లోబిన్ పెరిగే ఆహారం అందజేశారు.

ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యం

అల్వాల్: ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. హాత్ సే హాత్ యాత్రలో భాగంగా సోమవారం వెంకటాపురంలో నిర్వహించిన యాత్రలో నందికంటి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని వారి ఇబ్బందులను తొలగించే విధంగా కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉంటుందన్నారు. సంజీవ్‌కుమార్, నిమ్మ అశోక్‌రెడ్డి, కృష్ణగౌడ్, డోలి రమేష్, శివకుమార్ పాల్గొన్నారు.

సీతా రాముల కల్యాణ ఆహ్వానం

కుషాయిగూడ: శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 30న జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి హజరు కావాలని కోరుతూ కుషాయిగూడ శ్రీ పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు సోమవారం గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవిలకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వ రద్దు రాజ్యాంగ వ్యతిరేకం



జవహర్‌నగర్‌లో సత్యాగ్రహ దీక్షలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మల్లు రవి

జవహర్‌నగర్: జాతీయ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడం రాజ్యాంగ వ్యతిరేకమని మాజీ పార్లమెంట్ సభ్యుడు, టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ మల్లు రవి అన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అధ్యక్షతన సోమవారం జవహర్‌నగర్‌లో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి మల్లు రవి హాజరై మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతుకలపై, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడే వారిని భయపెడుతున్నారన్నారు. ఢిల్లీలో పంజాబ్ రైతులు చేపట్టిన ఆందోళనకు తలొగ్గి మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయడమే కాకుండా రైతులకు బహిరంగ క్షమాపణలు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. అదేవిధంగా రాహుల్ గాంధీ పట్ల అనుసరించిన తప్పిదాన్ని గుర్తించి ప్రధాని మోదీ దేశ ప్రజలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పడమే కాకుండా వెంటనే రాహుల్‌గాంధీపై పార్లమెంట్ సభ్యత్వంపై చేసిన రద్దును వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దీక్షకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నాయకులు భూపతి నర్సారెడ్డి, గోగుల సరిత, చరణ్‌కౌశిక్ యాదవ్, లక్ష్మీ, సుశాంత్‌గౌడ్, అనంతలక్ష్మీ, వినయ్, సదానంద్, కన్నయ్య రాజు, రాజుయాదవ్, బాలరాజుగౌడ్, రజితగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



మాట్లాడుతున్న చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: విద్యార్థులు నీటిని పొదుపుగా వాడుకొని భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని గురుకుల పాఠశాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ ఐడెంటిఫికేషన్ కార్యక్రమం

కీసర: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మైనారిటీ రుణాల గురించి జాయింట్ ఐడెంటిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ మంగతాయారు, బ్యాంకు అధికారులు హనుమనాయక్ తదితరులు పాల్గొని రుణాల కోసం హాజరైన 22 మంది మైనారిటీలకు జాయింట్ ఐడెంటిఫికేషన్ చేశారు.



పౌష్టికాహారంపై చిన్నారులు, తల్లులకు అవగాహన

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ పాల్గొని పౌష్టికాహారంపై చిన్నారులు, తల్లులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెంటమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కరీంగూడ గ్రామంలో...

కీసర: మండలంలోని కరీంగూడ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణపక్షం కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపాల్‌రెడ్డి పాల్గొని మిల్లెట్స్ (చిరుధాన్యాలు) తినడం వల్ల కలిగే ప్రయోజనాలను చిన్నారులు, తల్లులకు వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాధవరెడ్డి, గ్రామ కార్యదర్శి దివ్య, అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు సీసీ సుదర్శన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద, తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్, లక్ష్మాపూర్ ప్రభుత్వ పాఠశాల్లో...

మేడ్చల్‌రూరల్/శామీర్‌పేట్: శామీర్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ ఉన్నత పాఠశాలల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిరుధాన్యాల అవశ్యకతను వివరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. శామీర్‌పేట్ పాఠశాలలో ఎంపీపీ ఎల్లుబాయి పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు బాలమణి, ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, ఎంపీటీసీ నాగరాజు, పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల అందజేత



పరీక్ష ప్యాడ్లు అందుకున్న జెడ్పీ బాలికలతో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలోని జెడ్పీ బాలురు, బాలికల పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై మండల విద్యాధికారి శశిధర్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మీతో కలిసి అందజేశారు.

ఈ కార్యక్రమంలో హెచ్ఎం పాపిరెడ్డి, బస్వరాజ్, సాయిలు, స్వప్న, సంధ్యారాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగివచ్చి తిడుతున్నాడని చంపేసాడు

- సెక్యూరిటీగార్డుల మధ్య గొడవ
- కత్తితో గొంతుకోసి ఒకరి దారుణ హత్య
- పశ్చాత్తాపంతో పీఎస్‌లో లొంగిపోయిన నిందితుడు

మేడ్చల్‌రూరల్/శామీర్‌పేట్: ఒకే చోట సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహించే ఇద్దరి మధ్య తలెత్తిన గొడవ ఒకరి హత్యకు దారి తీసింది. చంపిన వ్యక్తి శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విషయం పోలీసులకు తెలుపడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. సీఐ సుధీర్‌కుమార్ వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం పిప్రా కనక్ గ్రామానికి చెందిన అచెలాల్ గుప్తా గత కొంత కాలంగా శామీర్‌పేట్ మండలం లాల్‌గడిమలక్‌పేట్ గ్రామ పరిధిలో ఉన్న హైటెక్ సీడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అదే కంపెనీలో గత పది నెలలుగా అస్సాం రాష్ట్రానికి చెందిన ప్రాబిన్ బోరా(39) సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహిస్తుండే వాడు. ప్రాబిన్ బోరా ఉదయం నుంచి సాయంత్రం వరకు... అచెలాల్ గుప్తా రాత్రి డ్యూటీలు చేసేవారు. ఇంత వరకు బాగానే ఉన్నా ప్రాబిన్ బోరా సాయంత్రం తన డ్యూటీ ముగిసిన వెంటనే బయటికి వెళ్లి మద్యం సేవించి కంపెనీ వద్దకు వచ్చి రాత్రి డ్యూటీలో ఉన్న అచెలాల్‌గుప్తాతో కారణం లేకుండానే గొడవ పడేవాడు. ఇలా గత కొన్ని రోజులు నిత్యం తాగివచ్చి గొడవపడటం , మద్యం సేవించాలని లేదంటే మద్యం ఇప్పించాలని అచెలాల్‌ను బలవంతం చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదానికి దారి తీసేది. అచెలాన్‌ను ఇదే క్రమంలో ప్రాబిన్‌బోరా దాడి చేసేవాడు. గత ఆదివారం సైతం ఇదే తంతూ జరగడంతో అచెలాల్ గుప్తా విసుగుచెంది యాజమాన్యానికి విషయం చెబుతానని ప్రాబిన్‌కు తెలుపడంతో ఆగ్రహంతో అతను కత్తి చూపించి ఎవరికన్నా చెబితే చంపుతానని బెదిరించాడు. అర్ధరాత్రి వరకు గొడవ పెట్టుకోవడంతో విసిగిపోయిన అచెలాల్ గుప్తా నిత్యం ఇతడి వేధింపులకు గురి కావడం, అతడి చేతులో దెబ్బలు తినడం కంటే చంపడం మేలని భావించి ప్రాబిన్ బోరా నిద్రపోయే వరకు వేచి ఉండి పడుకున్నట్లు నిర్ధారణ చేసుకుని కత్తితో గొంతు కోసి, తల, శరీరంపై దాడి చేసి హత్య చేశాడు. మరణించిన తర్వాత మృతదేహాన్ని సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో పడేశాడు. అనంతరం రక్తపు మరకలు కడుక్కుని, బట్టలు మార్చుకున్నాడు. చంపిన అనంతరం రాత్రంతా పశ్చాత్తాపానికి గురైన అచెలాల్ గుప్తా ఉదయాన్నే శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ వెళ్లి విషయం పోలీసులకు తెలిపాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి మార్చురీకి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.